సాక్షి
మెదక్

బుధవారం ; 24 ; జనవరి ; 2024



చిరుత కలకలం!

ఇబ్రహీంపూర్ శివారు అటవీ ప్రాంతంలో మంగళవారం చిరుత కనిపించిందని ప్రచారం జోరందుకుంది. వివరాలు 10లో ▸



పార్ట్‌టైమ్ స్వీపర్ల వెట్టి వెతలు

ప్రభుత్వ పాఠశాలలో ఏళ్లుగా పనిచేస్తున్న పార్ట్ టైం స్వీపర్లు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు 10లో ▸

27న మెగా జాబ్‌మేళా

మెదక్ కలెక్టరేట్: ఈనెల 27న జిల్లాలోని యువతీయువకుల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు యువజన, క్రీడల అధికారి నాగరాజు మంగళవారం తెలిపారు. 66 కంపెనీల ప్రతినిధులు సుమారు 4 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. వైస్రాయ్ గార్డెన్‌లో ఉదయం 8 నుంచి ఈ మేళా ప్రారంభమవుతుందని తెలిపారు.

న్యూస్‌రీల్

రిజిస్ట్రేషన్ల రద్దు సొమ్ము వెనక్కివ్వాలి

అసైన్డ్ భూసమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు నందు

నిజాంపేట(మెదక్): ధరణిలో రిజిస్ట్రేషన్లు రద్దు చేసుకున్న డబ్బులను ప్రభుత్వం వెంటనే తిరిగి ఇవ్వాలని అసైన్డ్ భూసమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు బైండ్ల నందు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ బుక్ చేసుకుని పలు కారణాల వల్ల రద్దు చేసుకున్నారని, ఈరోజు కూడా చెల్లించిన నగదు జమ కాలేదన్నారు. దీంతో చిన్న సన్నకారు రైతులను ఇబ్బంది పడుతున్నారన్నారు. రద్దు చేసుకున్న రిజిస్ట్రేషన్ల డబ్బులు కలెక్టర్ అకౌంట్లో జమవుతాయన్నారు. వాటిని రైతు ఖాతాలకు బదిలీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అధికారులు కూడా ఈ విషయమై దృష్టి సారించాలన్నారు.

మట్టి అక్రమ తరలింపు అడ్డగింత



లింగారెడ్డిపేట్‌లో మట్టిని అక్రమంగా తవ్విన ప్రాంతం, పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్



మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని లింగారెడ్డి పేట గ్రామ ప్రభుత్వ కుంటల్లోంచి మట్టిని అక్రమంగా తరలిస్తుండగా సోమవారం అర్ధరాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకునే లోపు అక్కడే రెండు టిప్పర్, జేసీబీ వదిలివేసి పరార్ అయ్యారు. వాటిని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. కాగా, మట్టి తవ్వకాలను కొనసాగిస్తే ఎన్టీపీసీ మెయిన్ లైన్ టవర్ కూలే అవకాశం ఉందని శాఖాధికారులు తెలిపారు. దీంతో సంస్థ భారీ నష్టం సంభవించవచ్చన్నారు. ఈ విషయమై ఎన్టీపీసీ విద్యుత్ అధికారులు, ఇరిగేషన్ ఏఈ అనురాధ, రెవెన్యూ అధికారులు వేర్వేరుగా మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వ్యాపారం సాగడం లేదని..

వ్యక్తి ఆత్మహత్య



మురారిమిశ్రా(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): వ్యాపారం సవ్యంగా సాగడం లేదని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రం సీతావది జిల్లా నాన్‌పూర్ పీఎస్‌సిర్‌సి గ్రామానికి చెందిన అరుణ్‌మిశ్రా తన ముగ్గురు కుమారులతో కలిసి మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో అద్దె కుంటూ స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు మురారి మిశ్రా(23).. మిశ్రా కమ్యూనికేషన్ దుకాణం నడుపుతున్నాడు. కొద్దిరోజుల నుంచి వ్యాపారం సరిగా సాగడం లేదని మనస్తాపం చెందుతున్నాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి షాపులో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మరుసటి రోజు ఉదయం షాపు తెరవ పోవడాన్ని గమనించిన సోదరులు షట్టర్ తెరచి చూస్తే అప్పటికే విగతజీవిగా కనిపించాడు. వారు వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

నేటి నుంచి 'ఎనీమియా ముక్త్ భారత్'

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో నేటి నుంచి ఏప్రిల్ 10 వరకు ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి చందూ నాయక్ మంగళవారం తెలిపారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హైదరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 24న వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లో ప్రారంభిస్తారని ఆరోజే జిల్లాలో మొదలవుతోందని తెలిపారు. రాష్ట్రీయ బాల్య సురక్ష కార్యక్రమం ద్వారా బాలికలకు ఆరు టీమ్‌ల ద్వారా రక్త పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో 8 నుంచి 12 తరగతుల విద్యార్థినుల్లో హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వారిని గుర్తిస్తారని తెలిపారు. వారికి మూడు నెలలపాటు బ్లూ(నీలం) కలర్ ఐరన్ మాత్రలు ఇస్తామని పేర్కొన్నారు. దీంతోపాటు ఐరన్ ఎక్కువగా ఉన్న ఆకుకూరలు, పప్పుధాన్యాలు, బెల్లం, ఖర్జూర, దానిమ్మ, గుడ్లు మొదలగు ఆహారాలు ఎక్కువ మొత్తంలో తీసుకోవాలనేలా అవగాహన కల్పిస్తామని తెలియజేశారు.

టచ్‌లో ఉన్నారా?

- సీఎం రేవంత్‌తో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల భేటీ
- ఉమ్మడి జిల్లాలో హాట్‌టాపిక్
- హస్తం గూటికి అంటూ ఊహాగానాలు
- అభివృద్ధి పనులకే వెళ్లామంటున్న ఎమ్మెల్యేలు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గూడెం, సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు

ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ కావడంపై సర్వత్రా హాట్ హాట్‌గా చర్చ జరుగుతోంది. వీరంతా 'హస్తం' వైపు చూస్తున్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఇటీవలే దావోస్ పర్యటన ముగించుకుని నగరానికి చేరుకున్న సీఎంతో నలుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు భేటీ కావడం.. అదికూడా రేవంత్ ఇంట్లో కలవడంపై తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. ఎమ్మెల్యేలు మాత్రం అభివృద్ధి పనుల కోసం కలిశామంటున్నా తెరపైకి రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు సైతం ఇందుకు దోహదం చేస్తున్నాయి.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సీఎం రేవంత్ రెడ్డిని నలుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. నర్సాపూర్, దుబ్బాక, పటాన్‌చెరు, జహీరాబాద్ ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, మాణిక్ రావు మంగళవారం సీఎం నివాసానికి వెళ్లి కలిశారు. వీరు సీఎంను కలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. వీరు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారా? అనే అనుమానాలు మొదలయ్యాయి. సునీతా లక్ష్మారెడ్డి గతంలో కాంగ్రెస్ నుంచే బీఆర్‌ఎస్‌లో చేరారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి మొదటి నుంచి గులాబీ బాస్ కేసీఆర్‌కు సన్నిహితుడు. మిగతా ఇద్దరు నేతలు కూడా కేసీఆర్ వెన్నంటి నడుస్తున్న వారే. రేవంత్‌రెడ్డితో పాటు, ఇంటెలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డిని కూడా వీరు కలిసినట్లు సమాచారం. రాష్ట్రంలో ఒకవైపు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య మాటల యుద్ధం నడుస్తున్న నేపథ్యంలో ఈ నలుగురు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం చర్చకు దారితీస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు విషయంలో బీఆర్‌ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్ రావులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇటు కాంగ్రెస్‌కు చెందిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితర మంత్రులు అదే స్థాయిలో తిప్పికొడుతున్నారు. ఆరు నెలల్లో ప్రభుత్వం పడిపోతుందంటూ బీఆర్‌ఎస్ విమర్శలపై స్పందించిన కోమటిరెడ్డి.. తమతో సుమారు 30 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో వీరు భేటీ కావడం హాట్‌టాపిక్‌గా మారింది.

మోదీని రేవంత్‌రెడ్డి కలిసినట్లుగానే..: ఎమ్మెల్యేలు

'సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగానే కలిశా.. ఇందులో ప్రత్యేకమేమీ లేదు.. పటాన్‌చెరు నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను కొనసాగించాలని కోరాం. ఇందుకు ప్రతిపాదనలు సీఎం దృష్టికి తీసుకెళ్లాం. ప్రధానిని రేవంత్‌రెడ్డి కలిసినట్లుగానే తాము కూడా నియోజకవర్గం అభివృద్ధి కోసం కలిశాం..'' అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి 'సాక్షి'తో అన్నారు. జహీరాబాద్‌లోనూ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరాం.. తమ నియోజకవర్గంలో ప్రొటోకాల్ పాటించడం లేదనే అంశంపైనా సీఎంతో చర్చించాం.. తాము నియోజకవర్గంలో పర్యటిస్తుంటే పైలెట్ వెహికిల్ కూడా ఇవ్వడం లేదు.. ఈ అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లాం.. అని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు 'సాక్షి'తో అన్నారు.

ప్రొటోకాల్ వివాదం..

ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ వివాదం తలెత్తుతోంది. ప్రధానంగా నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో నర్సాపూర్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య ఈ ప్రొటోకాల్ విషయంలో గొడవలకు దారితీసింది. ఈ ప్రొటోకాల్ వివాదాలు తలెత్తుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డిని కూడా కలిశామని తెలిపారు.



ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా పక్కన ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి

గౌరవానికి భంగం కల్గించొద్దు

- ఎస్సీ, ఎస్టీల అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ సమావేశంలో కలెక్టర్ రాజర్షిషా
- అధికారులు ఫ్రెండ్లీగా వ్యవహరించాలి: ఎమ్మెల్సీలు

మెదక్ కలెక్టరేట్: ఎస్సీ, ఎస్టీల గౌరవానికి భంగం కలిగించొద్దని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. దీనికి ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులైన దళితులతో పోలీస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు సున్నితంగా వ్యవహరించాలన్నారు. వారికి వ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించేలా పనితీరు ఉండాలన్నారు. 3 నెలలకోసారి ఈ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు.

సామరస్యంగా వ్యవహరించాలి

పోలీస్‌స్టేషన్లకు వచ్చే ప్రజల పట్ల సైతం పోలీస్ అధికారులు గౌరవంతో మసలుకునేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ బాలస్వామిని ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవ్‌రెడ్డి కోరారు. కేసుల్లో బాధితులకు అందాల్సిన ఆర్థిక పరిహారం సకాలంలో అందేలా చూడాలని జిల్లా అధికారులకు సూచించారు. సమాజంలో అందరూ ఒక్కటేనని, ఎలాంటి వివక్షా లేకుండా కలిసి మెలిసి జీవించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు ప్రవేశ పెట్టిన నివేదికలను వారు పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, డీఎస్పీలు, విజిలెన్స్ కమిటీ సభ్యులు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన సేవలు

అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలో మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్య పెరగాలన్నారు. మంగళవారం రాత్రి తన చాంబర్‌లో వైద్య అధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆస్పత్రుల్లో సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఫిబ్రవరి 12న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పిల్లలందరికీ టాబ్లెట్స్ వేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చందూ నాయక్, విజయనిర్మల, మాధురి, అలిలా, అరుణశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టండి

జిల్లా పోలీసు అధికారులకు డీజీపీ రవిగుప్తా సూచన



మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) రవి గుప్తా జిల్లా పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం ఎస్పీ బాలస్వామి, అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి ఆయన.. రోడ్డు భద్రతా ప్రమాణాలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై సమీక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, అత్యధికంగా ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు జరిగిన పోలీస్ స్టేషన్లను గుర్తించి అందుకు గల కారణాలను గుర్తించాలన్నారు. ఇలాంటి ప్రాంతాల్లో తక్షణ నివారణకు హెచ్చరిక బోర్డులు, చెట్లపొదల తొలగింపు, రేడియం స్టిక్కర్లు, రేడియం బ్లింకర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు అత్యధికంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అలాగే చిరు వ్యాపారులు రోడ్డుకు దూరంగా వ్యాపారం చేసుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అతివేగం, తాగి వాహనాలు నడపడమే ప్రమాదాలకు కారణమన్నారు. వేగ నియంత్రణ, తాగి వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానాలు వేయాలన్నారు. స్పీడ్ గన్లను ఏర్పాటు చేసి అతివేగంగా వెళ్లే వాహనాలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులది క్రియాశీలక పాత్ర



ఎన్జీఓ సంఘం జిల్లా నాయకులను సన్మానిస్తున్న నర్సాపూర్ యూనిట్ ఉద్యోగులు

టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

నర్సాపూర్ రూరల్: ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు టీఎన్జీఓ సంఘ కార్యకలాపాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలని ఆసంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్జీఓ భవన్లో నర్సాపూర్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజా సంక్షేమ పథకాలు అర్హుల దరిచేర్చేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. సంఘ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించాలన్నారు. ఏ ఒక్క ఉద్యోగి కూడా అధైర్యపడవలసిన అవసరం లేదన్నారు. నూతన పెన్షన్ విధానం, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ విధానం, ఆదాయ పన్ను పరిమితి పెంపు తదితర సమస్యలపై సంఘటితంగా పోరాడుదామన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి మినికిరాజ్ కుమార్ నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ప్రకటించారు.

నర్సాపూర్ సంఘం నూతన కార్యవర్గం ఇదే

అధ్యక్షుడిగా కే శేషాచారి, కార్యదర్శి రాకేష్, ఉపాధ్యక్షుడిగా బాసిత్ అలీలను ఎన్నుకున్నారు. కోశాధికారిగా వెంకట్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్1గా స్వామి, వైస్ ప్రెసిడెంట్ 2గా బి.జగజీవన్, వైస్‌ప్రెసిడెంట్ 3గా హాజీఆలీ, వైస్‌ప్రెసిడెంట్ 4గా కే శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ (మహిళ)గా కే.సరళ కుమారి, జాయింట్ సెక్రటరీ1గా జి.సుభాష్, జాయింట్ సెక్రటరీ 2గా విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ 3గా ఏ. శోభ, జాయింట్ సెక్రటరీ 4గా వి. జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి. చెన్నయ్య, పబ్లిసిటీ సెక్రటరీగా ఎం. సంగమేశ్వర్, స్పోర్ట్స్ సెక్రటరీగా రాజశేఖర్ గౌడ్, ఈసీ మెంబర్లుగా దుర్గ ప్రసాద్, లలిత బాయి, హఫీజ, శశికళ, ఊహలను ఎన్నుకున్నారు.

పట్నం వారం ఆదాయం రూ.70.22 లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో పట్నం వారం (మొదటి ఆదివారం) మూడు రోజుల బుకింగ్ ఆదాయం రూ. 70,22, 307 వచ్చినట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. శనివారం రూ.11, 84,726, ఆదివారం రూ. 47,82, 420, సోమవారం రూ.10,55,161 వచ్చిందని తెలిపారు. స్వామివారికి భక్తులు వివిధ రకాల మొక్కులు, దర్శనాలు, లడ్డూ ప్రసాదం, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వారా ఈ ఆదాయం సమకూరిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే రూ 20,38,488 అధికంగా వచ్చినట్లు ఆలయ బుకింగ్ ఇన్‌చార్జి మాధవి తెలిపారు.

టీపీఎస్‌ఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

మెదక్ మున్సిపాలిటీ: తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్(టీపీఎస్‌ఎఫ్) జిల్లా నూతన కమిటీ ఎన్నికై ంది. అధ్యక్షుడిగా కాయితి సంతోష్, ప్రధాన కార్యదర్శిగా పాతూరి రవి ఎన్నికయ్యారు. మంగళవారం మెదక్‌లో మంగళవారం బ్యాలెట్ ఓటింగ్ ద్వారా ఎన్నికలు నిర్వహించారు. కోశాధికారిగా బి. రాకేష్, ఉపాధ్యక్షులుగా కే. ప్రభాకర్ రెడ్డి, లింగప్ప, నవీన్, రజనీకాంత్, సహాయ కార్యదర్శులుగా ప్రవీణ్ రెడ్డి, జితేందర్, రమేష్, నారాయణలను సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ, సభ్యులు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు సన్మానించారు.

ప్రమాద బీమా పరిహారం చెల్లించాలి



అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

మెదక్ కలెక్టరేట్: 38 కుటుంబాలకు రూ. 6 లక్షల చొప్పున ప్రమాద బీమా పరిహారం చెల్లించాలని బాధితులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ కుటుంబాలకు నష్టం చేసిన టైపిస్ట్ నరేష్ సస్పెండ్ కాగా మరలా అతడిని విధుల్లోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనను చేపడతామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు.

మొక్కలతో వాతావరణ సమతుల్యం

నాటిన వాటిని పరిశీలించిన సీసీఎఫ్



మొక్కల వివరాలను తెలుసుకుంటున్న సైదులు

చేగుంట(తూప్రాన్): అటవీ ప్రాంతంలో మొక్కలు పెంచితే వాతావరణ సమతుల్యతను పెంపొందిత్తాయని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) సైదులు తెలిపారు. మండలంలోని రుక్మా పూర్ శివారులోని ఫారెస్టు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అన్ని రకాల మొక్కలను పెంచితే ఉత్పత్తులను పెంచుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రజలు సైతం అటవీ సంపదను కాపాడుకోవడానికి తమ వంతు ప్రయత్నం చేయాలన్నారు. తొలుత రుక్మాపూర్ శివారులోని ఫారెస్ట్‌లో ఎన్ని మొక్కలు నాటారు? వాటి పరిరక్షణకు ఏ రకంగా చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. మొక్కల పెంపకం విషయమై స్థానిక అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆయన వెంట జిల్లా అటవీశాఖ అధికారి రవిప్రసాద్, రామాయంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అనురాధ, బీట్ ఆఫీసర్ మధుబాల, సిబ్బంది పాల్గొన్నారు.

జోగిపేట ప్రజలకు రుణపడి ఉంటా

మంత్రి దామోదర రాజనర్సింహ



ప్రసంగిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట(అందోల్): ఎన్నికల సమయంలో తనకు అండగా నిలిచి గెలిపించిన జోగిపేట ప్రజలకు రుణపడి ఉంటానని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం పట్టణంలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జోగిపేటలోని ఎస్ఎస్‌కే సమాజ్ (పట్కరి) ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. తొమ్మిదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున అన్ని సమస్యలు పరిష్కరించుకుందామన్నారు. గతంలో ఎస్ఎస్‌కే సమాజ్ భవన నిర్మాణ పనులు తన హయాంలోనే ప్రారంభించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. భవనంలో సీసీ ఫ్లోరింగ్, కిచెన్‌షెడ్, గేట్ వద్ద సీసీ రోడ్డు ఏర్పాటుకు అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గుమస్తా సంఘం ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఎస్.సురేందర్‌గౌడ్, ఎ.చిట్టిబాబు, రంగ సురేష్, సుమిత్ర సత్యం, డి.శంకర్, పి.రేఖ ప్రవీణ్, హరికృష్ణాగౌడ్, నాగరాజ్, చందర్, దుర్గేష్, వెంకటేశం, యూసుఫ్ పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులతో ఉపాధ్యాయినీలు, కోచ్ పోచయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఖేల్ ఇండియా కిక్ బాక్సింగ్ ఉమెన్స్ లీగ్ పోటీల్లో మండలంలోని చిట్కుల్ కేజీబీవీ విద్యార్థినులు సత్తా చాటారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన పోటీల్లో ఆరుగురు పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలు పొందారని పాఠశాల ప్రత్యేకాధికారి అంజలి, కిక్ బాక్సింగ్ కోచ్ పోచయ్య తెలిపారు. క్రీడల్లో ఉన్న ఉపయోగాలు, ముఖ్యంగా కరాటే, కిక్ బాక్సింగ్ వంటి క్రీడలు మహిళలకు ఎంత అవసరమో వారు వివరించారు. పీఈటీ శారద, సిబ్బంది ఉమామహేశ్వరి, పద్మావతి, ప్రశాంతి, మంజుల విద్యార్థినులను అభినందించారు.

క్లుప్తంగా

దర్శనానికి వచ్చి అనంతలోకాలకు..

కారు డ్రైవర్‌ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి



బలరాం మృతదేహం

కొమురవెల్లి(సిద్దిపేట): కారు డ్రైవర్‌ నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణం బలైంది. ఈ సంఘటన మండలంలోని గురువన్నపేట శివారులో చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్‌ జిల్లా తాడూరు మండలం శిరిసవాడకు చెందిన పెద్దింటి బలరాం (57) కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనం చేసుకున్నాడు. సోమవారం రాత్రి జగదేవ్‌పూర్‌ మండలం కొండ పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. గురువన్నపేట శివారులో బస ఏర్పాటు చేసుకొని నిద్రిస్తుండగా బలరాం పైనుంచి కారు వెళ్లింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్‌ఐ నాగరాా తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు టౌన్‌: వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి రింగ్‌ రోడ్డు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి ప్రాణాలొదిలాడు. వయసు సుమారు 25 నుంచి 30 సంవత్సరాలుగా ఉంటుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఉంటే తమను సంప్రదించాలని పటాన్‌చెరు పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థి అదృశ్యం



మొగులప్ప

జహీరాబాద్‌ టౌన్‌: మండలంలోని హోతి(బి) గ్రామానికి చెందిన విద్యార్థి సిరిసిగా మొగులప్ప(19) అదృశ్యమైనట్లు జహీరాబాద్‌ రూరల్‌ ఎస్‌ఐ.ప్రసాద్‌ తెలిపారు. గ్రామానికి చెందిన సిరిసిగా తుల్జారాం కుమారుడు మొగులప్ప హైదరాబాద్‌లోని మియాపూర్‌లో గల శ్రీరామ జూనియర్‌ కళాశాలలో ఇంటర్‌ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆరోగ్యం దెబ్బతిందని గత నెల ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. ఈ నెల 22న సాయంత్రం నానామ్మ బాగమ్మ వద్ద పది రూపాయలు తీసుకుని బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో తండ్రి తుల్జారాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మొగులప్ప ఆచూకీ లభిస్తే 8712656764 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ ప్రసాద్‌ కోరారు.

అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

నారాయణఖేడ్‌: అయోధ్యలో బాలరాముడి దర్శనం కోసం ఈనెల 29 నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లు నడవనున్నాయని బీజేపీ నారాయణఖేడ్‌ అసెంబ్లీ కన్వీనర్‌ రజినీకాంత్‌ తెలిపారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 200 మందికి అవకాశం కల్పించనున్నట్టు చెప్పారు. జహీరాబాద్‌ పరిధిలోని వారు సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కాల్సి ఉంటుందని, అది ఏ రోజు బయలు దేరుతుందనే విషయం త్వరలో తెలుపుతామన్నారు.

పెట్టుబడి.. మొక్కుబడి..!

- నత్తనడకన రైతుబంధు పంపిణీ
- రెండెకరాల లోపు ఉన్నవారికే డబ్బులు జమ
- మిగతా రైతుల ఎదురుచూపు



జహీరాబాద్‌: జిల్లాలో రైతుబంధు సాయం నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు రెండెకరాల భూమి ఉన్న రైతులకు మాత్రమే డబ్బులు జమయ్యాయి. మిగతావారు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం పెట్టుబడి సాయం విడుదల చేస్తున్నామని నెలరోజుల క్రితం ప్రకటించింది. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో రైతుల ఖాతాల్లో దానికి సంబంధించిన డబ్బు జమ కాలేదు. రెండెకరాల భూమి ఉన్న రైతులకు మాత్రమే వారికి మాత్రమే పెట్టుబడి అందిందని రైతాంగం పేర్కొంటోంది. ఈ నెలాఖరు వరకు అర్హులందరికీ రైతుబంధు అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే యాసంగి పనులు మొదలయ్యాయి. సాయం సకాలంలో అందక సాగు కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది.

కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతుబంధు పథకం పేరును రైతు భరోసాగా మార్చింది. ఎకరం భూమికి ఒక్కో సీజన్‌లో రూ.7,500 వంతున సాయం అందిస్తామని ఎన్నికల ముందు ప్రకటించింది. రైతు భరోసా విధి విధానాలు ఇంకా ఖరారు కాకపోవడంతో ఈ సీజన్‌కు గాను పాత విధానంలోనే ఎకరానికి రూ.5వేల వంతున సాయం అందిస్తోంది. సంగారెడ్డి జిల్లాలో 4,16,210 మంది రైతులు ఉన్నారు. ఈ సీజన్‌కు గాను రూ.393.21 కోట్ల మేర పెట్టుబడి సాయం రైతాంగం ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.108 కోట్ల మేర రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఎకరం లోపు ఉన్న కొంత మంది రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమకాలేదని పేర్కొంటున్నారు.

పెట్టుబడి సాయాన్ని ఐదెకరాలకు కుదించడం, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించే వారు, బడా వ్యాపారులు, ఆర్థికంగా వృద్ధి చెందిన వారికి ఇవ్వకూడదనే డిమాండ్‌ ముందు నుంచి వినిపిస్తోంది. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఇదేమీ పరిగణనలోకి తీసుకోకుండా భూమి ఉండి.. పట్టాపాసు పుస్తకం పొందిన ప్రతి ఒక్కరికీ రైతుబంధు నిధులు జమ చేసింది. వందల ఎకరాల భూమి ఉన్న రైతులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు కూడా పెట్టుబడి సాయం తీసుకున్నారు. ఈ విధానంతో రాష్ట్ర ఖజానా దివాలా తీసే పరిస్థితి ఏర్పడిందని అప్పట్లో ప్రతిపక్షాలు విమర్శించాయి. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కింద అందించే సాయం విషయంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా సాగుతుందని ప్రకటించారు. యాసంగి సీజన్‌ సమయం మొదలు కావడంతో ఇప్పుడు విధి విధానాలు రూపొందించి సాయం జమచేయాలంటే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం పాత పద్ధతిలోనే నిధులు జమచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వర్షాకాలం సీజన్‌ వరకు కొత్త మార్గదర్శకాలతో పెట్టుబడి సాయం జమచేసే అవకాశం ఉంది. పాత పద్ధతిలోనైనా మెజార్టీ రైతులకు సాయం అందలేదు. ప్రభుత్వ ఖజానాలో నిధుల కొరత కారణంగా జాప్యం జరుగుతోందనే అభిప్రాయం అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం త్వరగా అందించాలని రైతాంగం కోరుతోంది.

నెలాఖరుకు ఖాతాల్లో జమ



రైతు బంధు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ నెలాఖరు వరకు అందరి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. ఇప్పటి వరకు రెండున్నర ఎకరాలు ఉన్న రైతుల ఖాతాల్లో జమ చేశాం. ఇప్పటివరకు రూ.108 కోట్ల మేర రైతుల ఖాతాల్లో వేశాం.

–నర్సింహారావు, జేడీఏ, సంగారెడ్డి

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- వ్యక్తిత్వ వికాస నిపుణుడు మల్లేశ్‌
- టెన్త్‌ విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు మల్లేష్‌

గజ్వేల్‌రూరల్‌: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు అన్నమైన మల్లేష్‌ అన్నారు. పట్టణంలోని లక్ష్మణ్‌గార్డెన్స్‌లో శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం గజ్వేల్‌, రాయపోల్‌, వర్గల్‌ మండలాల్లోని 22 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు 'కీ టూ సక్సెస్‌' అనే ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల పట్ల భయం వద్దన్నారు. బట్టీ పట్టి కాకుండా ఇష్టంగా చదువుకోవాలని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఆందోళనకు గురికాకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడంతో పాటు మననం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై విద్యార్థులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, ఎంఈవో సునీత, మండల నోడల్‌ అధికారి కృష్ణ, రాష్ట్ర పూర్వ బాలవికాస్‌ ఇన్‌ఛార్జి సుఖేందర్‌, గ్రామసేవ మహాయజ్ఞం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట నర్సింహారెడ్డి, సత్యసాయి సేవా సమితి గజ్వేల్‌, బూర్గుపల్లి కన్వీనర్లు వెంకటేశం, బాలనర్సయ్య, ప్రతినిధులు లక్ష్మణ్‌, మహేష్‌, చంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు అగ్నిపథ్‌ మంచి అవకాశం

వాయుసేన అధికారి రాజేశ్‌



అగ్నిపథ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారి రాజేశ్‌

సిద్దిపేటజోన్‌: యువతకు భారత ప్రభుత్వం అగ్నిపథ్‌ ద్వారా మంచి అవకాశం కల్పిస్తుందని బోయిన్‌పల్లి ఎయిర్‌ ఫోర్స్‌ అకాడమీ అధికారి రాజేశ్‌ సూచించారు. మంగళవారం స్థానిక ప్రతిభ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు అగ్నిపథ్‌ గురించి జిల్లా యువజన శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా ఉత్తర భారతదేశంలో యువత అత్యధికంగా సైన్యం లో చేరడానికి ఆసక్తి చూపుతుంటారని, ఇప్పుడిప్పుడే మన దక్షిణ భారతదేశంలో దీనిపై అవగాహన వస్తుందని అన్నారు. యువకులు మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాత, దేహ దారుఢ్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేసి, నాలుగు సంవత్సరాల సమయంలో మంచి నైపుణ్యం చూపిన వారిని నేరుగా సైన్యం లోకి తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి నాగేందర్‌, ఎయిర్‌ ఫోర్స్‌ అకాడమీ చీఫ్‌ ఆనంద్‌ గోస్వామి, కళాశాల ప్రిన్సిపాల్‌ సూర్య ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణకు స్పీకర్లు

రైతన్నల వినూత్న ఆలోచన



మొక్కజొన్న పంటకు రక్షణగా చెట్టుపై అమర్చిన మైక్‌

అక్కన్నపేట(హుస్నాబాద్‌): విత్తనాలను భూమిలో వేసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతుకు ప్రతిరోజూ పోరాటమే. పంటను రక్షించుకొనేందుకు రైతులు శ్రమ ఇంతా అంతా కాదు. అనేక రకాలుగా కాపాడుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా పక్షులు, పశువులు ఒక దశలో పెద్ద శత్రువులుగా మారతాయి. వాటి నుంచి పంటను రక్షించుకోవడం రైతుకు కత్తిమీద సాము లాంటిది. పక్షులు, కోతులు, అడవి పందుల తదితర జంతువులు అటువైపు రాకుండా జాగ్రత్త పడుతుంటారు. అక్కన్నపేట మండలంలోని కట్కూర్‌, దుబ్బతండా, చాపగానీతండా, కేశనాయక్‌తండా, బంగారులొద్దితండా, గండిపల్లి తదితర గ్రామాల్లో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు తదితర పంటలను సాగుచేస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో పక్షులు, అడవి పందులు, కోతులు ఇతర జంతువులు పంట చేలపై పడి తీవ్రంగా నష్టాన్ని కలిగిస్తున్నాయి. దీంతో పలువురు రైతులు పంటలను కాపాడుకోవడానికి వినూత్నంగా ఆలోచించారు. చార్జింగ్‌ స్పీకర్లను కొనుగోలు చేసి, అందులో పక్షులు, ఇతర జీవులు బయపడే విధంగా రకరకాల శబ్దాలను రికార్డు చేసి పొలాల్లో అమర్చుతున్నారు. వాటి నుంచి 'ఉష్‌...ఛూ..అరె... అరె.. బౌ బౌ'అంటూ శబ్దాలు వస్తాయి. వాటిని పొలాల వద్ద చెట్లకు అమర్చడంతో పక్షులు, కోతులు, అడవి పందులు అటు వైపు రావడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు.

మగ పిల్లలు పుట్టడం లేదని..

వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్‌: మగ పిల్లలు పుట్టడం లేదని వేధింపులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని బాపట్ల జిల్లా చీరాల మండలం పేరాల గ్రామానికి చెందిన శరణ్యను(33) 2017లో అదే జిల్లాకు చెందిన చీరాల మండలం ఈపుర పాలెం గ్రామానికి చెందిన బాలాజీతో వివాహ జరిగింది. ఆరేళ్ల క్రితం బతుకుదెరువు కోసం అమీన్‌పూర్‌ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి వచ్చి జిరాక్స్‌ షాప్‌ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి యశస్విని(5), ఇంకో ఆరు నెలల పాప ఉంది. అయితే ఇద్దరూ ఆడపిల్లలు పుట్టారని.. భర్త, అత్త మామలు వేధించడం ప్రారంభించారు. తీవ్ర కలత చెందిన ఆమె.. సోమవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి..



ఆకుల శ్రవణ్‌

పటాన్‌చెరు టౌన్‌: డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌ పరిధిలోని బీరంగూడ మారుతీనగర్‌కు చెందిన ఆకుల శ్రవణ్‌ జొమాటో డెలివరీ బాయ్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం భార్య ప్రియాంకకు ఫోన్‌ చేసి స్కూల్‌ నుంచి పిల్లలను తీసుకురమ్మని చెప్పాడు. సాయంత్రం 6 గంటలకు భర్త శ్రవణ్‌కు ఆమె ఫోన్‌ చేయగా స్విచ్‌ఆఫ్‌ వచ్చింది. దీంతో భర్త కోసం స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట(మెదక్‌): బొలేరో ఢీకొట్టడంతో టీవీఎస్‌ వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి రుద్రారం గ్రామ శివారులోని పేపర్‌మిల్‌ వద్ద చోటుచేసుకుంది. వెల్దుర్తి మండలం రామాయపల్లి గ్రామానికి చెందిన కురుమ మల్లేశం చేగుంటకు వచ్చి టీవీఎస్‌పై తిరుగు ప్రయాణం కాగా మెదక్‌ వైపు నుంచి ఎదురుగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టింది. దీంతో మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసునమోదు చేశారు.

నిర్లక్ష్యంగా నడపడం వల్లే ప్రమాదాలు

ఆర్టీఓ జయప్రకాశ్‌రెడ్డి

జహీరాబాద్‌ టౌన్‌: వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరుగుతోందని ఆర్టీఓ జయప్రకాశ్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఆర్టీఓ కార్యాలయం వద్ద లారీ, ఆటో డ్రైవర్లకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ రూల్స్‌ పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా వాహనాలు నడపాలన్నారు. ప్రమాదాల నివారణకు డ్రైవర్లు దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో ఆటో, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపూర్‌ శివారులో చిరుత కలకలం!



ఫారెస్టు అధికారులు సేకరించిన పులి పాదముద్రలు

చేగుంట(తూప్రాన్‌): చిరుత సంచారం కలకలం రేపుతోంది. మండలంలోని ఇబ్రహీంపూర్‌ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మంగళవారం చిరుత కనిపించిందని ప్రచారం జోరందుకుంది. దీంతో చుట్టుపక్కల పొలాలున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, రుక్మాపూర్‌, పులిమామిడి, ధర్మారం గ్రామాలు ఈ శివారు అటవీ ప్రాంతాన్ని ఆనుకొనే ఉంటాయని, ఇది ఇక్కడే సంచారిస్తుందని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ నాగరాణి ఘటన స్థలానికి చేరుకొని పులి పాద ముద్రల ఆనవాళ్లను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇది కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. రైతులు పొలాలకు వెళ్లాలనుకుంటే అందరూ కలిసికట్టుగా వెళ్లాలన్నారు. పట్టుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి మోతిమాత జాతర



మోతిమాత ఆలయం



అమ్మవారు

రెండు రోజుల పాటు కార్యక్రమాలు

జహీరాబాద్‌: మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో గల మోతిమాత జాతర రెండు రోజుల పాటు ఘనంగా జరగనుంది. 24, 25 తేదీల్లో జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన గిరిజనులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ ఉత్సవాలను మినీ మేడారంగా చెబుతారు. కోహీర్‌, జహీరాబాద్‌, ఝరాసంగం, మొగుడంపల్లి, న్యాల్‌కల్‌ మండలాలతో పాటు పక్కనే ఉన్న సంగారెడ్డి, అందోల్‌, నారాయణఖేడ్‌, నర్సాపూర్‌ నియోజకవర్గాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఉత్సవాల కోసం ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చూస్తున్నారు. 24 ఉదయం 10 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమంతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 25న భవానీమాత పూజ, మధ్యాహ్నం భక్తులు మొక్కల సమర్పణ, ముడుపులు కట్టే కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి భంజారా భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

270 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న లారీ

సంగారెడ్డి: అక్రమంగా తరలిస్తున్న 270 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని పట్టుకున్నట్టు ఎస్‌ఐ పాటిల్‌ క్రాంతికుమార్‌ తెలిపారు. హైదరాబాద్‌లోని కాటేదాన్‌ నుంచి రేషన్‌ బియ్యాన్ని గుజరాత్‌కు తరలిస్తుండగా మంగళవారం ఉదయం శివ్వంపేట గ్రామ శివారులో గల దాబా వద్ద లారీని పట్టుకున్నామన్నారు. ఈ క్రమంలో ఆటువైపు పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న స్థానిక పోలీసులకు అనుమానం వచ్చి డ్రైవర్‌ను ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పాడని, దీంతో లారీని పరిశీలించగా రేషన్‌ బియ్యంగా గుర్తించామన్నారు. లారీని పుల్కల్‌ పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ కమ్‌ ఓనర్‌ రాజుభాయ్‌ బోసియాపై కేసు నమోదు చేసి, బియ్యాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్టు ఎస్‌ఐ పాటిల్‌ చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్‌: ఉపాధి కరువై ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొన్న సంఘటన మండల పరిధిలోని కోమటిబండలో వెలుగు చూసింది. కోమటిబండలోని వడ్డెర కులానికి చెందిన వల్లపు ఆగయ్య(45)కు భార్య కనకవ్వతో పాటు ఇద్దరు కుమారులున్నారు. ఆగయ్య గ్రామంలో కూలీ పనులతో పాటు రాళ్ల కొడుతూ జీవనం సాగించేవాడు. గ్రామ సమీపంలో 50ఎకరాల్లో విస్తరించిన రాళ్ల గుట్టపై మిషన్‌ భగీరథ హెడ్‌వర్క్స్‌ను ఏర్పాటు చేయడంతో అక్కడ సంబంధిత అధికారులు రాయిని కొట్టేందుకు అనుమతులు ఇవ్వలేదు. ఈ క్రమంలో కుటుంబ పోషణ, ఇతర అవసరాల కోసం రూ. 5లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చేమార్గం లేక మనస్తాపానికి గురైన ఆగయ్య మూడ్రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అదే రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని చెట్ల పొదల్లో చెట్టుకు ఆగయ్య ఉరివేసుకొని ఉన్నట్లు గుర్తించిన సమీప వ్యవసాయ పొలాల రైతులు మంగళవారం పోలీసులకు, బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆగయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూర్ఛతో రైతు మృత్యువాత



లక్ష్మయ్య మృతదేహం

పాపన్నపేట(మెదక్‌): మూర్ఛ వచ్చి పొలంలో పడి రైతు మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గాజుల గూడెంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సంగన్న కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాయికోటి లక్ష్మయ్య (37) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి అప్పుడప్పుడూ మూర్ఛ వస్తుంటుంది. మంగళవారం తన భార్య కవితను వెంటబెట్టుకొని పొలం వెళ్లాడు. నీటి పంపు వాల్వ్‌ను కట్టేందుకు వెళ్తున్న క్రమంలో పక్కనున్న పంట కాలువలో పడి చనిపోయాడు. అతను ఎంతకీ తిరిగి రాకపోవడంతో వెతుక్కుంటూ వెళ్లిన భార్యకు విగతజీవిగా కనిపించాడు. పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేశారు.

పార్ట్‌టైమ్‌ స్వీపర్ల వెట్టి వెతలు

- పేరుకే పార్ట్‌ టైమ్‌.. చేసేది ఫుల్‌ టైమ్‌
- నేటికీ నెల వేతనం రూ.4 వేలే
- రెగ్యులర్‌, పదోన్నతి కల్పించాలని డిమాండ్‌



పాఠశాలలో పని చేస్తున్న పార్ట్‌ టైం స్వీపర్‌

మునిపల్లి (అందోల్‌): ప్రభుత్వ పాఠశాలలో ఏళ్లుగా పనిచేస్తున్న పార్ట్‌ టైం స్వీపర్లు ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని జీతంతో కుటుంబాన్ని పోషించలేకపోతున్నారు. వీరికి అందుతున్న జీతం కుటుంబ పోషణకు ఏ మాత్రమూ సరిపోవడం లేదు. అర్ధాకలితో అలమటిస్తున్నారు. పైగా రూ.4 వేల వేతనం నాలుగు నెలల నుంచి అందకపోవడంతో వారి బాధ వర్ణనాతీతం. ఇచ్చే అరకొర కూడా సమయానికి ఇవ్వడం లేదు. ఇక పని విషయానికొస్తే.. ఉదయం పాఠశాల తెరిచి గదులు శుభ్రం చేసి పిల్లల, ఉపాధ్యాయుల అవసరాలు చూసుకోవాలి. నిబంధనల ప్రకారం పని గంటలు నాలుగే అయినా పొద్దస్తమానం ఇక్కడే ఉండాలి. పేరుకు పార్ట్‌ టైం ఉద్యోగమే కానీ ఫుల్‌ టైం వర్క్‌ ఉంటుందని వాపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 42 మంది పార్ట్‌ టైం స్వీపర్లుగా పని చేస్తున్నారు. డైలీ లేబర్‌ ఒక రోజు కూలి పనులకు వెళితే సుమారు 500 రూపాయలు సంపాదించుకుంటాడని, కానీ తమకు మాత్రం కనీస వేతనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నెల నెలా వేతనాలు మంజూరు చేయాలని, రెగ్యులర్‌ చేయాలని కాంగ్రెస్‌ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 1992లో డిసెంబర్‌ 12న పార్ట్‌ టైం స్వీపర్ల వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రారంభంలో నెలకు 350 రూపాయల వేతనం ఇచ్చింది. 12 ఏళ్ల తర్వాత రూ.1,623లు చేసింది. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం .. 31 సంవత్సరాలుగా పని చేస్తున్న వారిని పర్మినెంట్‌ చేయాలని, అలాగే రెగ్యులర్‌, వేతనాల పెంపు కోసం జీఓ 112ను విడుదల చేసింది. ఆచరణలోకి వచ్చేసరికి ఇది అమలు కావడం లేదని తెలుస్తోంది.

నిబంధనల ప్రకారం వేతనం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం పార్ట్‌ టైం స్వీపర్లకు వేతనాలు మంజూరు చేస్తున్నాం. రెగ్యులర్‌ ప్రభుత్వమే చేయాల్సి ఉంది. మా పరిధిలో ఏమీ లేదు.

– ఎల్లయ్య, చీఫ్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌)

ఉసురుతీసిన ఆర్థిక ఇబ్బందులు

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



కనకయ్య (ఫైల్‌)

రాయపోలు(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన రాయపోలు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అరికెల కనకయ్య (40) బతుకు దెరువు కోసం అప్పుచేసి దుబాయ్‌ వెళ్లాడు. సరిగా పని కుదరకపోవడంతో మూడేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చి మరింత అప్పుచేసి తమ వ్యవసాయ భూమిలో బోరుబావి తవ్వించాడు. సరిగా పంట దిగుబడులు రాకపోవడంతో అప్పుల వారి వేధింపులు అధికమయ్యాయి. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో వారినుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో తీవ్ర కలత చెంది సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొలం పనులకు వెళ్లి రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వచ్చిన అతని భార్య సులోచన ఇంటి తలుపులు తీసి చూసేసరికి భర్త దూలానికి ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.